



చెట్టుమీదినుంచి కాకిపిల్ల కింద పడింది. కుక్క పరుగెత్తుకొచ్చి మురక

చూస్తోంది. కాకిపిల్ల రెక్కలను టపటపలాడిస్తోంది కాని లేవడానికి, ఎగరడానికి వీలు కావడం లేదు. కుక్క మూతి తిప్పేసుకుని తిరిగి మురక చూడసాగింది. చెట్టుపైనుంచి కాకులు ఒకటికి పది చేరి కావ్ కావ్ కావ్ మని అరవసాగినయ్....పదిచెట్ల పెట్టునుంచి ఏకమైన కాకులు పిచ్చిగా అరుస్తూ వున్నాయి తమ జాతిని రక్షించుకునేందుకుగాను.

ఆచెట్టుకిందనేవున్న డంగు సున్నం రాయి పాడుబడివుంది. గుండ్రంగా వున్న కాలువ మట్టితోకూరుకుపోయింది. రాయి మాత్రం ఓ వైపుకు ఒరిగి వుంది. దాని మీద కూర్చున్నఒకతను, అక్కడే నిల్చున్న మరొకతను మాట్లాడం ఆపి, కాకుల అరుపువిని, కిందపడ్డ కాకిపిల్లని గమనించి దగ్గరలో వున్న కుక్కను బోకెపించతో తరిమారు— కుక్క కుయ్యిమంటూ పరుగెత్తింది....

చెట్టుదగ్గర్లోనే బజారుంది. బజారులో జనం పల్చగా వున్నారు. బజారులో మిరపకాయ బజ్జీలు, బుడాలు, చనిగలు, మురుకులు, పాపడాలు అమ్ముకునే లచ్చమ్మ దుకాణం అరుగుమీద 4,5 గ్గురు మగవాళ్లు కూర్చున్నారు. ఆ దుకాణం మీదికి ఓ యిద్దరుఆడపిల్లలు తమ ముగ్గురు తమ్ముళ్లతో వచ్చారు. ఆ ఇద్దరు ఆడపిల్లలు చెరి పదిపైసలు లచ్చమ్మచేతిలో పెట్టి బుడాలు ఇమ్మన్నారు. లచ్చమ్మ రెండేసి బుడాలు చేతిలో పెట్టింది. దాంతో ముగ్గురు మగపిల్లలు చేతులు చాచారు— లచ్చమ్మ నవ్వుకుని

"ఏమియ్యాలే కొడుకులారా?...." అంటూ ముగ్గురికి కొన్ని కొన్ని చనిగలు పెట్టింది. అరుగుమీద కూర్చున్న వాళ్ళలో ఒకతను ఇదంతా గమనిస్తూ, "ఆ....యిగ నువ్ బ్యారం చేసినట్టే—మాబావను నడిసినట్టే! వచ్చినోనికల్లా యిన్ని చనిగలు పెడితే లాభం గువ్వల కయినట్టే..." అన్నాడు వెటకారంగా, మిగతా వాళ్ళు నవ్వారు. లచ్చమ్మ మాత్రం "ఏంచేద్దాం బిడ్డా పోరలు....మనపిల్లలు అడిగితే మాత్రం పెట్టుకోమా?" అని ఎదురుప్రశ్న వేసింది. ఆమెవయను నలభై సంవత్సరాల పైన వుంటుంది.

వాళ్ళు వ్యంగ్యంగా నవ్వుతూ తలలూపారు.

లచ్చమ్మకు ఎదురుగా కొంత దూరంలో పిప్పరమెంట్లు, బిస్కట్లు, బీడీలు, అగ్గి పెట్టెలు, పల్లికాయలు, బటానీలు మరికొన్ని చిన్నపిల్లలు తినే వస్తువుల్ని పెట్టుకుని బాలమ్మ కూర్చున్నది.

బాలమ్మకు కొద్ది దూరంలో గంపలో ఎండిన కూరగాయలు పెట్టుకుని గిరాకీకోసం ఎదురు చూస్తోంది కూరగాయల కిష్టమ్మ.

అక్కడికి దగ్గరిలో కొట్టం లాంటి మంగలి దుకాణంలో ఓ పటేలు గెడ్డంగీయించుకుంటూ వున్నాడు. దారిలో అక్కడొకరు, ఇక్కడొకరు కనిపిస్తూవున్నారు. పొద్దు నడిజాము అవుతోంది. ఎక్కువ ఎండ లేకపోయినా వేడిగానే వుంది. ఆ బజారులోకి ఓ స్త్రీ మెల్లిగా నడుచుకుంటూ వస్తోంది. ఆమె శరీరంలో ఎక్కడో నొప్పి వున్నట్టు మెల్లిగా నడుస్తోంది.

ఆమె మెల్లి మెల్లిగా లచ్చమ్మ దుకాణం వరకు నడిచి వచ్చింది.

ఆమె మొఖంలో ఏలాంటి భావంకనిపించడంలేదు. ఏడ్చి ఏడ్చి ఏడ్చి కన్నీళ్ళు కూడా కరువైనట్టు, బాధపడి బాధపడి బాధపడి మనసు మొద్దుబారినట్టు, మెదడు మీద బండెడు బండెడు బరువు మోపితే ఆలోచన కోల్పోయినట్టు, దేన్ని చూసినా చలనం లేని దానిమల్లే ఆమె ఉంది. లచ్చమ్మదుకాణంముందు నిల్చుని దీనంగా కళ్ళనిండా కరుణతో, నిశ్చలంగా చూస్తూ నిల్చుంది ఆ కొత్తస్త్రీ.

ఆమె ఎడమచేతిలో ఖాళీసిగరెట్ పెట్టెలున్నాయి. కొన్ని మడత చేసి వున్నాయి, కొన్ని అలాగే వున్నాయి. వాటితో పాటు మరికొన్ని కాగితం ముక్కలు వేళ్ళసందున పెట్టుకుంది. అదే ఎడమచంకలో ఓ మురికిబట్టల మూట వుంది....

ఆమె మొఖాన బొట్టులేదు—ముక్కుకు ముక్కుపుల్లమాత్రం వుంది. మొఖంనిండా చెమట ఆరిపోయి, దుమ్మునిండుకుని జిడ్డుగావుంది. శరీరఛాయ సామనలుపు కావడంతో మరింత జిడ్డు అనిపిస్తోంది. తల వెంట్రుకలు కొన్ని పెద్దగా మరికొన్ని చిన్నగా 'అంటలు' కట్టినట్టు వేలాడుతూ వున్నాయి. తలనిండా దుమ్ము ధూళి, పాపిట్లో మట్టిస్పష్టంగాకనిపిస్తోంది. ఆమె మెడలో కూడా ఏ ఆభరణాలులేవు. అక్కడక్కడ చిరిగిన జాకెట్టు వేసుకుంది. మాసిపోయిన పూలపూల చీర కట్టుకుంది. అదీ అడ్డదిడ్డంగా వుంది. కొంగులు కొన్ని ఊడిపోతున్నాయి. కాళ్ళు ఎంతో దూరంనుంచి నడచి వొస్తున్నట్టుగా దుమ్ముతో వున్నాయి.

ఎదురుగా నిల్చున్న ఆ కొత్త ఆడమనిషి, అవతారాన్ని, ఆకారాన్ని చూసి లచ్చమ్మ మనసు నొచ్చుకుంది. కుడిచేతిని తలకు పెట్టుకుని, విచారంతో "పరమాత్మా! ఏంబాధ కలుగజేస్తివి ఆపోరికి..." అని తనలో తానే అనుకుంది. లచ్చమ్మ ముందు నిల్చున్న ఆ స్త్రీ వయసు ఇరవై ఐదు సంవత్సరాలకు మించదు. కాస్త భారీశరీరం కావడంతో కొంత వయసు ఎక్కువనే భ్రమ కలుగవచ్చు. ఆమె వైపే అందరి కళ్ళు చూస్తున్నాయి. అరుగుమీద కూర్చున్న ఒకరిద్దరు ఒకరికొకరు చూసుకుంటూ వెటకారంగా నవ్వుకోసాగారు.

లచ్చమ్మ మనసుమాత్రం మూల్గింది. అదే నా బిడ్డ అయితే పలకరించనా? అని ఆలోచించింది. ఆ ఆడబిడ్డ అవతారం చూసేసరికి మనసు కరిగి నీరయింది. ఆమె ఆ చుట్టుపక్క గ్రామాలకు చెందిన స్త్రీ కాదని ఆమెను చూస్తున్న వాళ్ళందరికీ తెలుసు.

లచ్చమ్మ కాస్త ముందుకు వంగి.

"ఏం కావాలే?..." అని అడగింది., ఏమైనా తింటుందేమోననే ఉద్దేశంతో

ఆ కొత్త ఆడమనిషి ముఖంలో ఎలాంటి భావం పలకలేదు— నోట మాట రాలేదు. కనీసం కనురెప్పలను కూడా కొట్టలేదు. అలాగే విగ్రహంలానిలబడింది. కనీసం అక్కడున్న తినుబండారాలను చూసైనా నోట్లో నీళ్ళు ఊరినట్టులేదు.

అర్థమయిందో లేదోననుకుని లచ్చమ్మ చేత్తో సైగచేస్తూ "ఏం కావాలే?..."అని తిరిగి అడిగింది.

అయినప్పటికీ సమాధానం లేదు. నిజానికి ఆమె మనసులో సుడిగాలి ఎంత ఉధృతంగా వీస్తున్నదో? ఎన్ని ఆకులు రాలిపోతున్నాయో? ఆ సుడిగాలి దుమారంలో ఎన్నెన్ని ఆకులు, అలములు ఎగిరెగిరి పడుతున్నాయో ఎవరికితెలుసు?...ఆమెలో ఎన్ని రక్తసముద్రాలు పోటులెత్తుతున్నాయో? అయినప్పటికీ ఆమెలో ఉలుకు పలుకు లేదు. అలా పలుకు లేకుండా ఎలా ఉండగలుగుతుందో అక్కడ వున్నవాళ్ళకెవరికీ అర్థం కావడం లేదు.

అక్కడ ఏదో వింత చూద్దామని మరో నలుగురైదుగురు పోగయ్యారు.

"దేవుడా నీ గుళ్ళె యింత మన్నువోతు—ఆడపుట్టుక పుట్టిచ్చి గిట్ల వెట్ల గుట్టల పాలు జేసినవ్‌కదరా?..." అంటూ లచ్చమ్మ కూర్చున్న దగ్గర్నించి లేచి ఇంకొంత ముందుకొచ్చి

"తింటావా? " అని అడిగింది.

ఆమె చూపులు మిరపకాయ బజ్జీల మీద, బుడాల మీద నిలిపిందికాని ఏం చప్పుడు చేయలేదు.

లచ్చమ్మ సహనంతో 'ఇదేనా బిడ్డయితే తింటవా అని మరోసారి అడుగకపోదునా?' అని మనసులో అనుకుని మరోసారి సైగజేసింది."తింటవా?"అని చలనంలేదు.

"ఎవరైన యింట్ల కెళ్లి ఎల్లగొట్టిండా?" అని అడిగారెవరో అక్కడకూర్చున్న వాళ్ళలోంచి.

ఆమె కనురెప్పలు కూడా కొట్టలేదు.


లచ్చమ్మ మాత్రం "ఏమోబిడ్డా ఎట్లాతెలువది. ఏంకావాలే అంటె సప్పుడులేదు, తింటవా? అంటె సప్పుడు లేదు. యిగ మనకెట్ల తెలువాలే యింట్లోంచి ఎల్లగొట్టింది? లేనిది?...." అంది పెదవులిరుస్తూ—

"యింట్ల కొట్లాడి బాయిల పడ్తనని మూట తీసుకుని ఎల్లినట్టుంది?...." మరొకతను తన ఊహను వెల్లడించాడు.

"బాయిల పడేది వుంటే గీడికెందుకొస్తది. అలగానీ మాటలుగానీ..."తెలియకుండా, తెలివిలేకుండా మాట్లాడుతున్నాడని లచ్చమ్మ ఆమాటలను కొట్టిపారేసింది.

"మరెందుకొచ్చింది?....."తనమాట నెగ్గకపోయేసరికి పౌరుషంతో అన్నాడు అతను.

"ఏం సీతమ్మ కష్టమొచ్చి ఎల్లిందో? ఆ భగవంతునికే ఎరుక—మనకెట్లతెలుస్తది....చెప్తేకదాతెలిసేది?' అంది లచ్చమ్మ అక్కడ కూర్చుంటూ.



"ఏ....అవన్ని నక రాల్....మా సెతందుకు మంచి—గనే వున్నది. కావాలని అట్ల యాక్టింగ్ చేస్తుందొస....' అన్నాడెవరో కుఱ్ఱాడు.

"వాని మూతి మీద తన్నురా!...."అంది లచ్చమ్మ. ఆ మాటలు వినిపించిన వైపు కోపంగా చూస్తూ.

ఆ కుఱ్ఱాడు కిక్కురుమనలేదు.

లచ్చమ్మతలతిప్పి ఆ కొత్త ఆడమనిషి వైపు చూస్తూ. "ఏ వూరునీది?" అని ఆరా తీయసాగింది.

ఆమె చిన్నగా ఊపిరి వదిలిందిగాని చప్పుడు చేయలేదు.

"జుట్టు పట్టి నాలుగు తలిగిస్తే అదే అన్ని చెప్పదొస..." అన్నాడు యింతకుముందు కుఱ్ఱాడు.

"అరె, పోరడా నీనోరు ఊకుంట లేదురా? అన్ని కావరం పట్టిన మాటలు మాట్లాడుతున్నవ్?..." అంది లచ్చమ్మ మరింత కోపంతో.

ఆ కుఱ్ఱాడు మొఖం తిప్పేసుకున్నాడు. తిరిగి నిశ్శబ్దం, "ఏం పేరుమాయవ్వా?...." అనిఅడిగింది ప్రేమగా లచ్చమ్మ.

ఆమెనుంచి సమాధానం లేదు. చూపులు అలాగే నిల్చిపోయాయి. కదలిక లేదు. నోరు విప్పలేదు.

"పిచ్చిది వున్నట్టుందొస...."మంగలి దుకాణంలో గెడ్డం గీసుకుని, కొద్దిసేపటి నుంచి అక్కడే వుండి చోద్యం చూసి, యింటికి పోతున్న పటేలు వ్యాఖ్య చేసి పోతున్నాడు.

"మీ కండ్లకందరూ పిచ్చోళ్ళే కనిపిస్తరు...." అని లచ్చమ్మ బయటకు అనలేదుగాని మనసులో అనుకుంది.

ఈలోపుగా కిష్టమ్మ కూరగాయలు గంప అక్కడే పెట్టి లచ్చమ్మ దగ్గరికి వచ్చినిల్చుంది. మరో ఒకరిద్దరు ఆడవాళ్లు ముక్కు మీద వేలేసుకుని ఆ కొత్త ఆడ మనిషిని చూస్తూ నిల్చున్నారు.

"అయ్యోపాపం వ(క్షి)చ్చిలెక్క ఒక్కటి ఎటు అని ఎళ్లిందో?" అంది ఓ స్త్రీ

"ఎటు ఎళ్లింది? సెంచారం పట్టింది— ఎవరో ఆ పుణ్యాత్ములు సెంచారం పట్టిచ్చునోళ్ళు? వాళ్ళకొడు కులకు, బిడ్డలకు పుణ్యం కలుగుతది తియ్...." వెట కారంగా అంది లచ్చమ్మ.

"ఉ.....అనది— ఆ....అనది ఏమే?" అంది మరోస్త్రీ "ఏమనుమంటవ్ ఎంత వనవాసంల ఎళ్లిందో?...." అంది కూరగాయల కిష్టమ్మ ముక్కుమీది నుంచి వేలు తీస్తూ.

"ఎంత కష్టమొచ్చినా, బాధవొచ్చినా, కన్నోళ్ళ తోటి, లేక కులంతోటి చెప్పుకుంటరు, గాని గిట్ల ఊర్ల మీదపడుతారే?...ఇప్పుడు ఎవలు ఆదుకుంటరు దాన్ని......" అంది ఇంతకు ముందుఅడిగిన స్త్రీ.

"ఆ పిల్లకు తల్లిదండ్రి వున్నరో లేదో? అత్తమామ వున్నరో లేదో? తెలువదాయె మనకు—గవన్ని మన మెట్ల అందాం చెప్పు..." అంది లచ్చమ్మ.

సందేహాలు అడిగిన స్త్రీనోరు మూసుకుంది.

మరికొంతమంది పిల్లలు గుమికూడారు.

లచ్చమ్మదుకాణంకు ఎదురుగా పిప్పెరమెంట్లు, బిస్కట్లు, బీడీలు అమ్మే బాలమ్మ తానుకూర్చున్న దగ్గర్నుంచిలేచి లచ్చవ్వ దగ్గరికి వచ్చి, చెవిలో ఏదో చెప్పింది.

లచ్చమ్మ నోరు తెరచి, ముక్కుమీద వేలేసుకుని ఆశ్చర్యంగా బాలమ్మ వైపుచూసి, అరుగుమీది నుంచి కిందికి దిగింది.

మెల్లిగా ఆ కొత్త ఆడమనిషి దగ్గరికి నడిచింది. ఆమె పిరుదుల దగ్గర చీరకు పెద్ద రక్తపుమరక—ముట్టయుంది. లచ్చమ్మ ఆ మరకను చూడగానే

".....ఆడదాని బతుకు ఎంత అద్వానం బతుకు సూడు. వింత ఆగమాగం బతుకు....అయ్యో భగవంతుడా ఆ పిల్ల నీకేం పాపం చేసిందిరా దాని బతుకు గట్ల చేసినవ్..." అంటూ నుదురు అరచేత్తో కొట్టుకుంది.

ఇటు తిరిగి చూడగానే పిల్లలందరూ ఆ కొత్త ఆడమనిషి వైపే చూస్తూ కనిపించారు. దాంతో లచ్చమ్మకు కోపం వొచ్చి

"ఏయ్ పిల్లలూ...మీకు సిగ్గు శరం ఏమీలేవా? నడువుండ్రి— ఏం సూస్తున్నర్?

ఏం భాగోతు లాడుతుండా) ఈడ?....నడువుండ్రి.....పొండ్రి...మీ యిండ్లకు మీరు పొండ్రి— ఏదో అనాథ దారి తప్పి వొస్తే కాకుల్లెక్క మూగి తమాష జూస్తున్నర్? పొండ్రి.....ఎవలిదారిన వాళ్లు నడువుండ్రి యి పిల్లలకైతే గింతనన్న శిగ్గులేదు...."అంటూ చిన్న పిల్లల వైపు ఓ చిన్నరాయి విసిరేసింది.


రు. 1,00,000/- విలువగల బహుమతులు

గెలవండి - ఎంట్రీ ఫీ లేదు

| | | |
|---|---|---|
| 25 | 18 | 23 |
| 20 | 22 | 24 |
| 21 | 26 | 19 |

| | | |
|---|---|---|
| | | 22 |
| | 23 | |
| 24 | | |

మొదటి బహుమతి: వెస్పా స్కూటర్, రాజ్‌దూత్ మోటర్ సైకిల్, కలర్ టి.వి. కన్సోలేషన్ బహుమతులు: ఆధునికంగా దిగుమతి చేయబడిన జపాన్ మోడల్ సోనీ టు-ఇన్-వన్ రు.250/- లకు మాత్రమే చెయిన్ లింక్ సిస్టమ్ క్రింద. 19 నుండి 27 వరకు సంఖ్యలనుపయోగించి నలువుగా, అడ్డంగా, అయిమూలగా కూడిన మొత్తం 69 రావాలి. ఒక సంఖ్య ఒక మారు మాత్రమే వాడాలి. మీ ఎంట్రీలను 15 రోజులలోగా పంపండి.

–Samarat Sales (69 UM)

Post Box No.7174, New Delhi-2




**ఉచితంగా అద్భుతమైన బహుమతులు గెలవండి**

1వ బహుమతి: రాజ్‌దూత్ మోటార్ సైకిల్ లేదా టెలివిస్టా టి.వి.వి.

కన్సొలేషన్ బహుమతి: సోనీ టు-ఇన్-వన్ ధర రు. 960/- కాని చెయిన్ లింక్ పథకం ప్రకారం మీకు రు. 240/-కే లభిస్తుంది. ఇతర వాటికి భిన్నమైన ప్రత్యేక సొల్యూషన్‌కి మొదటి బహుమతి. అటువంటిదే సొల్యూషన్‌కి కన్సొలేషన్ బహుమతి యిస్తారు.

| | | |
|---|---|---|
| పదకొండు | పదహారు | తొమ్మిది |
| పది | పన్నెండు | పద్నాలుగు |
| పదిహేను | ఎనిమిది | పదమూడు |

నమూనాలో చూపిన విధంగా పోస్ట్‌కార్డు మీద 9 గళ్ల గట్టు తయారు చేయండి. ఏడు నుంచి పదిహేను వరకు గల అంకెలను, నిలువుగా, అడ్డంగా, ఒక మూల నుంచి మరొక మూల వైపుగా కూడినట్టయితే మొత్తం ముప్పైమూడు వచ్చేలా ఉపయోగించండి. ఒక అంకెని ఒక్కసారే వాడాలి. మాచవ [illegible] వివరించిన సవివర పద్ధతి ప్రకారం బహుమతి యివ్వటం జరుగుతుంది. మీ ఎంట్రీలను 15 రోజులలోగా పంపండి. ప్రోత్సాహకుల నిర్ణయం అంతిమం, చట్టపరంగా దానికి కట్టుబడి వుండాలి.



**SONI INTERNATIONAL**
**Post Box No. 9403**
**DELHI-110 051**

J/1372/Tel.

చిన్నపిల్లలురా, మీరు యిక్కడుండి ఏ జేస్తరు? పొండ్రి నాయనలూ పొండ్రి....'' అని లచ్చమ్మ వాళ్లకు చేతు లు జోడిస్తూ వెళ్లగొట్టింది.

ఆ కొత్త ఆడమనిషి వైపు విచిత్రంగా చూస్తున్న నలుగురయిదుగురు ఆడపిల్లల్ని కూరగాయల కిష్టమ్మ బెదిరించి వెళ్లగొట్టింది.

బాలమ్మ దగ్గరికి లచ్చమ్మ వొచ్చి

''బాలక్కా! నీ బిడ్డయినా, నాబిడ్డయినా గినుంటి ఆలతుల వుంటే వూకుంటమానే? పాపం ఆ పోరి ఏ ఊరికేలి ఎన్నిదినాల మంచి నడుసుకుంట వొస్తుందో? ఎన్ని వనవాసాలు ఎల్లదీసుకుంట వొస్తుందో? తిన్నదో? లేదో? పోరి మొఖం సూస్తె గోసనిపిస్తుందే....''అంది.

''ఆ పోరి అవతారం చూసిన ఏ ఆడదానికైనా గోసనిపిస్తది— మరి యిప్పుడు ఏం చేద్దామంటావు?..'' అని అడిగింది బాలమ్మ.

లచ్చమ్మ క్షణం ఆలోచన చేసి

''యింటికాడ నాపాత చీరెవుంది తెప్పిస్త. గటుసాటుకు తీస్కపోయి ఆ ముట్టయిన చీరె యిడిపిచ్చి నా పాత సీరె కట్టిపిద్దామా?...'' అడిగింది.

''మంచిది....'' అంటూ తల వూపింది బాలమ్మ.

అక్కడే నిల్చున్న ఓ స్త్రీని పిలిచి తన యింటికిపోయి, తన బిడ్డను అడిగి ఓ పాత చీర పట్టుక రమ్మని లచ్చమ్మ పురమాయించింది.

ఆమె అక్కడినుంచి చీరకోసం బయలు దేరింది.

అలాగే చూస్తూవున్న ఆ కొత్త ఆడమనిషి దగ్గరికి లచ్చమ్మ నడిచి

''రాబిడ్డా? యిటు పక్కకు కూసుందువురా...'' అని భుజం మీద చేయివేసింది. మూడు రోజుల క్రితం తన ఊర్లో పటేళ్లకొడుకులు ముగ్గురు బలవంతాన అనుభ వించినప్పుడు రాని దుఃఖం లచ్చమ్మ ''రాబిడ్డా....'' అని భుజంమీద చెయ్యి వేసేసరికి ఆ ఆడమనిషి గొల్లున, సముద్రపు కెరటం విరుచుక పడ్డట్టు ఏడ్చింది. అక్కడ వున్న వాళ్ళందరూ ఆశ్చర్యపోయారు.

*

### ముసలి సరసం...

ఆ వృద్ధ దంపతులకు ఎనభైయేళ్ళు దాటినా సరదా లకి సరసాలకీ లోటులేదు. ఒక రోజున కొత్త కోడలిని వెంటబెట్టుకుని వాళ్ళు మార్కెటింగ్‌కి వెళ్ళారు. చాలా వస్తువులు కొన్నారు.

కోడలు రెండు చేతుల్లోనూ రెండు బుట్టలు తీసుకొంది. మిగిలినవి మరో బుట్టలో పెట్టి మామ గారు తీసుకున్నారు. ఆ బుట్టతాను తీసుకుంటానని అత్తగారు అడిగింది. కాని ఆయన ఇయ్యలేదు. చివరికి ఇల్లు సమీపిస్తుంటే ''పోనీ ఈ కాస్త దూరమైనా నన్ను మోయనిస్తారా లేదా?'' అని అడిగింది ఆవిడ ఆప్యా యంగా.

''అమ్మా...ఆశ...ఇంతదూరం నువ్వేమోసు కొచ్చావని ఇంట్లో వాళ్ళు అనుకోడానికా? అదేం కుదరదు నేనే మోస్తాను'' అంటూ విదిలించాడు ముసలాయన.

# సిరిసిరి మువ్వలు

'నీ కొక సిగరెట్టిస్తా
నాకొక శతకమ్ము వ్రాసి నయముగ నిమ్మా
త్రైకాల్యస్థాయిగ నీ
శ్రీ కావ్యము వరలు నోయి సిరిసిరి భాయ్!!'

కవితో కావ్యం గురించి బేరమా? వంద పద్యాలు రాస్తే ప్రతిఫలం ఓ సిగరెట్టా? ఇది నిజమా? వేళాకో ళమా? శ్రీ శ్రీ ఎవరినెగతాళి చేస్తున్నాడు? లేక శ్రీ శ్రీకే ఎగనామమా?

'నాకొక శతకమ్ము వ్రాసి నయముగ నిమ్మా' అని అడిగిందెవరు? ఎందుకోసం? ఎప్పటి మాట ఇదీ? ఆ అడిగింది చక్రపాణి గారు. ఇది 1945 నాటి మాట. అప్పట్లో ఆంధ్రజ్యోతి అని మాసపత్రిక వస్తూ ఉండేది. ఆ పత్రిక సంపాదకుడే ఈ చక్రపాణి. ఇది కలం పేరు. అసలు పేరు ఎ.వి. సుబ్బారావు. సరికొత్త ప్రయోగా లకూ ఫీచర్లకూ పెట్టింది పేరులా ఉండేది. అప్పటి ఆంధ్రజ్యోతి. అదిగో ఆ పత్రికలో వేసుకుందామని చక్రపాణి శ్రీ శ్రీ గారినడిగారు.

అయితే, అడిగిన తీరిదేనా? అడిగే తీరూ ఇదేనా? శ్రీ శ్రీ సిగరెట్టుమీద సిగరెట్టు కాలుస్తూ ఉండే రోజులాయె! ఆయనకు పద్యం కావాలి! ఈయనకు సిగరెట్టు కావాలి!


అంతవరకూ బాగానే ఉంది. చక్రపాణి వంటి సహృదయుడిలా అడిగాడని చెప్పడంలో అర్థమేమిటి? ఆయనతో చనువెక్కువైనందువల్ల ఇది ఛలోక్తా? ఏమైనా ఇక్కడే ఉంది శ్రీ శ్రీ సాధించిన వ్యంగ్యం.

అసలు బేరాలాడటం పెట్టుబడారీ మనస్తత్వం. ఏ బేరం లేకుండానే పూర్వం కవుల్ని కృతి భర్తలు సన్మానించేవారు. ఆ భూస్వామ్య వ్యవస్థ కనీసం ఈ విషయంలో బాగానే ఉండేది. కవులకు మేడిమాన్యా లూ చీనిచీనాంబరాలు లభించిన రోజులవి. రాజుగారు ముందే కవిని సన్మానించి నాకో కావ్యం రాసి ఇవ్వరూ అని అడిగిన రోజులవి. ఆరోజులూ ఆ పద్ధతులూ ఆ కావ్యాలూ పోయాయి. (కావ్యాలున్నాయి. మళ్లీ అలాం టి కావ్యాలు రావు) ఇప్పుడు పత్రిక లొచ్చాయి. సంపాదకులు కృతులు తమకిమ్మని అడగడమంటే తమ పత్రికలో ప్రచురణార్థం ఇమ్మని అడగడమే! దానికి ప్రతిఫలం ఆఫర్ చేస్తారు.

అయితే సిగరెట్టు గొడవేమిటి? డబ్బే ఇస్తాననొచ్చు కదా!! ఇక్కడ సిగరెట్టుకో కథ ఉంది. కన్యాశుల్కంలో గిరీశం అంటాడు కదా— ''ఖగపతి యమృతము తేగా భుగ భుగ మని పొంగి చుక్క భూమింబడియెన్ పొగమొక్కై జన్మించెను. పొగత్రాగని వాడు దున్నపోతై పుట్టున్'' ఇంతకన్నా ముందుకే వెళ్ళాడు శ్రీ శ్రీ— ఖగరాట్ కృషి ఫలితంగా పొగాకు భూలోకమందు పుట్టెనుగానీ పొగచుట్టలెన్నియైనను సిగరెట్టుకు సాటి రావు సిరి సిరి మువ్వా!— అదండీ సిగరెట్టు కథ. పొగచుట్ట భూస్వామ్య చిహ్నమనీ సిగరెట్టు బూర్జువా జెండాక్ర అనీ అనుకుందామా? హెచ్చుపని చేయిం చుకుని, తక్కువ ప్రతిఫలం ఇవ్వడం, బూర్జువా లక్షణం. సిగరెట్టిచ్చి శతకం ఇమ్మనడం ఏ లక్షణమో చూడండి!

—మిరియాల రామకృష్ణ

## ప్లాస్టిక్ మోటార్ సైకిల్



ఫ్రాన్స్ ఆటోమొబైల్ ఇంజనీర్ 'ఫెర్డినాండ్ పోర్షె' తయారుచేసిన ఈ మోటార్ బైక్ ఒక లీటరు పెట్రోలుకు 150 కిలోమీటర్లు ఇస్తుంది. ఈ బైక్ ఇంజన్ తప్ప మిగతా బాడీ అంతా ప్లాస్టిక్‌తో చేయబడింది. 'యమహా 500 SR' ఇంజన్ గల ఈ బైక్ పేటెంట్ హక్కుల కోసం అనేక ప్రముఖ కంపెనీలు పోటీపడుతున్నాయి. ఇంకా పేరు పెట్టని ఈ బైక్ 1995 కల్లా వ్యాపార పరంగా ప్రపంచం అంతటా మార్కెట్లో ఉంటుంది.